క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి కనోయిన్, కయాకింగ్ పోటీల్లో నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు మహమ్మద్ షరీఫ్, సెకండియర్‌లో గురువర్ధన్, ఏసురాజుకు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. సోమవారం విద్యార్థులను అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపాళ్లు శైలజా రాణితో కలిసి అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 4, 5 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి కనోయిన్, కయాకింగ్ క్రీడల్లో పతకాలు సాధించారని చెప్పారు. స్పోర్ట్స్ కమిటీ సభ్యులు విజయానంద్, వ్యాయామ అధ్యాపకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

అప్రెంటిషిప్ మేళాకు 35 మంది హాజరు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలోని డోన్ ఐటీఐలో జరిగిన అప్రెంటిషిప్ మేళాకు జిల్లాలోని ఐటీఐ పూర్తి చేసిన వారు 35 మంది హాజరయ్యారని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ధర్మకుమార్ సోమవారం తెలిపారు. అప్రెంటిషిప్ మేళాకు జిల్లాలో మూడు ప్రైవేట్ కంపెనీలు పాల్గొన్నట్లు తెలిపారు. కర్నూలుకు చెందిన సోలార్ ఎనర్జీ సిస్టం, అగ్రిసోల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఎస్ఎస్‌వీ ఆటో గ్యారేజ్ ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని 12మందిని ఎంపిక చేసుకున్నారని వెల్లడించారు. అప్రెంటిషిప్ అడ్వైజర్ నాగ కేషాలు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన



శ్రేయను అభినందిస్తున్న మంత్రి

నంద్యాల(అర్బన్): ఫెన్సింగ్ ఏషియన్ గేమ్స్‌లో సత్తా చాటిన నంద్యాలకు చెందిన పబ్బతి చిన్మయి శ్రేయను రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సోమవారం అభినందించారు. మంత్రి మాట్లాడుతూ.. ఫెన్సింగ్ క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి నంద్యాలకు గుర్తింపు తేవాలని ఆకాంక్షించారు.

16లోగా ఎస్టీ పునరుద్ధరణపై ప్రకటన చేయాలి

నంద్యాల(అర్బన్): ఈనెల 16వ తేదీలోపు వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ముఖ్య నాయకులతో ఆయన మాట్లాడుతూ వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణపై 2019లో ప్రధాని నరేంద్రమోదీ వాల్మీకులకు స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నన్ను నమ్మండి మీకు న్యాయం చేస్తామని చెప్పి 2024 ఎన్నికలు జరిగి ఏడాదిన్నర కావస్తున్నా స్పందన లేదన్నారు. ఈనెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న ప్రధాని వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణపై కార్యాచరణ చేపట్టి పార్లమెంట్‌లో ఆమోదం పొందేలా చూడాలని కోరారు. నాయకులు పరమేష్, మల్లికార్జున, బాలహుసేన్, సుబ్బరాయుడు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోఆప్షన్ మెంబర్ మృతి



నివాళులర్పిస్తున్న బిజేంద్రారెడ్డి

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామానికి చెందిన కోఆప్షన్ సభ్యుడు అల్లా మహమ్మద్(56) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామానికి చేరుకుని మహమ్మద్ మృతదేహంపై పూలమాల వేసి, నివాళులర్పించారు.

వదలని వర్షం .. ఆందోళనలో రైతులు

ఉయ్యాలవాడ: మండలంలో సోమవారం మధ్యాహ్నం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. 20 రోజులుగా కురిసిన వర్షాలకు పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచి రబీ సాగుకు రైతులకు ఇబ్బందికరంగా మారింది. రసాయనిక ఎరువులు ఎత్తుకునేందుకు వేపుగా పెరిగిన కలుపు మొక్కలను తొలగించుకునేందుకు భూమి తడి ఆరకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

నకిలీ మద్యంపై కదం తొక్కిన మహిళలు

- భారీ ర్యాలీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: నకిలీ మద్యంతో ప్రాణాలు తీస్తున్న కూటమి ప్రభుత్వంపై మహిళలు కదం తొక్కారు. ఎన్ – బ్రాండ్ లిక్కర్‌ను అరికట్టాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలోని నలుమూలల నుంచి తరలి వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, మహిళలు, ప్రజా సంఘాల నాయకులు సోమవారం భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలికి చేరుకుని అక్కడ దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డితో కలిసి కడప – కర్నూలు రోడ్డుపై కూటమి ప్రభుత్వానికి, ఎన్ – బ్రాండ్ మద్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీగా ఎక్సైజ్ స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ ఎక్సైజ్ అధికారికి వినతి పత్రం అందజేస్తూ పేదల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా ప్రభుత్వంలో చలనం లేదని, మద్యం దుకాణాలు వేళాపాలా లేకుండా నడుపుతున్నారని, విచ్చలవిడి మద్యం అమ్మకాలను నియంత్రించాలని, కల్తీ మద్యాన్ని అరికట్టాలని, బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలించాంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు చేతుల మీదుగా బి ఫాం అందజేసి ఎమ్మెల్యేగా పోటీ చేయించిన వ్యక్తే ఇప్పుడు నకిలీ మద్యం తయారు చేస్తూ దొరికిపోతే అతను వైఎస్సార్‌సీపీకి చెందినవాడని మాట్లాడేందుకు సిగ్గుండాలన్నారు. నకిలీ మద్యంతో సంపద సృష్టించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నిరూపించారని ఎద్దేవా చేశారు. ఇలాంటి మద్యం తాగే ఓ వ్యక్తి మూడేళ్ల చిన్నారిని లైంగికంగా వేధించి బండకేసి కొట్టి చంపారని అసహనం వ్యక్తం చేశారు. ఆ కుటుంబాన్ని పార్టీ పెద్దలు ఒక్కరైనా పరామర్శించక పోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం నుంచి రూ 5 లక్షలు పరిహారం అందజేశామని చెబుతూ అందులో జీఎస్టీ కింద పెద్ద మొత్తంలో కోత విధించడం సిగ్గుచేటన్నారు. నాసిరకం మద్యాన్నినికి ప్రజలు బలి కాకముందే సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, వీరభద్రుడు, నాయక్ వసీం, జెడ్పీటీసీలు శకుంతల, దిల్‌షాద్ బేగం, మాధవి, నాయకులు గంధం రాఘవరెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, పలచాని మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నాణ్యమైన మద్యం అంటే ఇదేనా?



ఎన్నికల ముందు నాణ్యమైన ముద్యం అందిస్తామని చెప్పి ఇప్పుడు ఎక్కడ చూసినా నకిలీ మద్యం ఏరులై పారిస్తున్నారు. కల్తీ మద్యం తాగి యువత నుంచి వృద్ధుల వరకు ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. దీన్ని అరికట్టాల్సిన ప్రభుత్వం ఈ మద్యం మాది కాదు అంటూ సన్నాయి నొక్కులు నొక్కడం సిగ్గుచేటు.

– మాధవీలత, కొండాపురం

కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి



విచ్చలవిడిగా సరఫరా అవుతున్న నకిలీ మద్యంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పల్లెల్లో ఎక్కడ చూసినా లెక్కలేనన్ని బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకున్నారు. మాకు నకిలీ మద్యం కాదు కావల్సింది.. కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.18,500 ఇస్తానని చెప్పినావు. దమ్ముంటే ఆ డబ్బు ఇచ్చి మాట్లాడు.

– సత్యవతి, గుండుపాపల

కల్తీ మద్యాన్ని అరికట్టాలి



నంద్యాలలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు, మహిళలు

- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన
- కదం తొక్కిన మహిళలు
- ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందజేత

నంద్యాల: కల్తీ మద్యం అమ్మకాలను వెంటనే అరికట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని నూనెపల్లె నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కల్తీ మద్యం వల్ల అమాయక ప్రజలు ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయని, కూటమి ప్రభుత్వం కల్తీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలంటూ ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్ మిల్ అమీర్‌బాషా ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.

విచ్చలవిడిగా విక్రయం..

మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా దాల్‌మిల్ అమీర్‌బాషా, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికళారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నకిలీ మద్యాన్ని విచ్చలవిడిగా విక్రయిస్తోందని, కూటమి నాయకులు డబ్బే ప్రధానంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మంచినీరు దొరకకపోవచ్చు కానీ ఈ ప్రభుత్వంలో మద్యం మాత్రం ఎక్కడ పడితే అక్కడ బహిరంగంగానే లభ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం తాగి అనేకమంది అమాయక ప్రజలు ప్రాణాలను కోల్పోయారని, కుటుంబాలు రోడ్డున పడ్డాయని, వీటన్నిటిని చూస్తూ ఎక్సైజ్ శాఖ మంత్రి చోద్యం చూస్తూ ఉండటం సరికాదని, కల్తీ మద్యం నియంత్రించలేని మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బడి లేదు గుడి లేదు ఎక్కడైనా మద్యం దొరుకుతుందని, అడుగడుగునా బెల్టు షాపులను ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ రామలింగారెడ్డి, దృశ్యకళల మాజీ డైరెక్టర్ సునీత అమృతరాజ్, జిల్లా మేధావుల సంఘం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, జిల్లా అధికార ప్రతినిధి అనిల్ అమృత రాజ్, జిల్లా జనరల్ సెక్రెటరీ దేవనగర్ బాషా, నంద్యాల జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు టివి రమణ, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, అసెంబ్లీ లీగల్ గ్రీవెన్స్ అధ్యక్షుడు వివేకానంద రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రుడు, క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు కారు రవికుమార్, క్రిస్టియన్ మైనారిటీ అసెంబ్లీ అధ్యక్షుడు మనోజ్, అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు శ్రీనివాసులు, అసెంబ్లీ మహిళ అధ్యక్షురాలు హుసేనమ్మ, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ హైమావతి, నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, పార్టీ మండలం అధ్యక్షుడు బసవేశ్వర రెడ్డి, కౌన్సిలర్లు కృష్ణమోహన్, మేస చంద్రశేఖర్, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్బలక్ష్మి, సాదిక్ బాషా, కోఆప్షన్ సభ్యులు శోభారాణి, సర్పంచులు కోటిరెడ్డి, రామసుబ్బయ్య రఘురామిరెడ్డి, ఐజయ్య, సుబ్బయ్య, మాజీ కౌన్సిలర్స్ మునయ్య కన్నమ్మ జాకీర్ హుసేన్, లక్ష్మీనారాయణ, పున్నా శేషయ్య, నాయకులు, గన్ని కరీం, కిరణ్ కుమార్, సాయిరాం రెడ్డి, రహంతుల్లా, పార్థుడు, ఎద్దు రవి, జలీల్, కాల్వ నాగరాజు, చాణిక్య రాజు, మూలసగరం భాస్కర్ రెడ్డి, మధు గౌడ్, శంకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

హామీల అమలు ఏమైంది?



మాట్లాడుతున్న సుంకయ్య

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలు ఏమైందని వామపక్ష కార్మిక సంఘాల నాయకులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఏసురత్నం ప్రశ్నించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వామపక్ష కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన ఉమ్మడి జిల్లా పర్యటన సందర్భంగా కర్నూలుకు వస్తున్న ప్రధాన మంత్రి గో బ్యాక్ అంటూ నంద్యాల జిల్లా కేంద్రంలో 15వ తేదీన కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇప్పటి వరకు పరిష్కారం కాలేదన్నారు. 44 కార్మిక సంక్షేమ చట్టాలను నాలుగు కోడ్స్ తీసుకొచ్చి కార్మిక హక్కులు హరించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. 13 గంటల పని చేసే విధానాన్ని రద్దు చేయాలన్నారు. స్కీం వర్కర్స్, ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన వర్కర్లకు కనీస వేతనం ఇచ్చి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ విద్యుత్ విద్యారంగాల్లో కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అసంఘటిత కార్మికులైన ఆటో, హమాలీ, బిల్డింగ్ వర్క్సకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ సంఘాల నాయకులు శ్రీనివాసులు, బాలవెంకట్, భువనశ్రీనివాసులు, సుశీలమ్మ, చౌడప్ప పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): దశాబ్దాలు గడిచినా శ్మశాన వాటిక లేక చింతల చెరువు గ్రామ దళితులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్‌ఓ రామునాయక్‌కు అందజేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు మాట్లాడుతూ చాగలమర్రి మండలం చింతలచెరువు గ్రామంలో అంత్యక్రియలకు తీసుకెళ్లడానికి రైతులు దారి ఇవ్వక పోతుండటంతో వాగుల వెంబడి వెళ్తూ ప్రమాదాపు అంచుల్లో ఖననం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయకపోవడంతో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, మధు, పాములేటి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రతాప్, ఉపాధ్యక్షుడు ఉదయ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఈనెల 22 నుంచి నవంబర్ 12వ తేదీ వరకు జరిగే బస్సు జాతను జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ వంద రోజుల్లో రద్దు చేస్తామన్న 107, 108, 77 జీవోలు ఇంత వరకు ఎందుకు రద్దు చేయలేదని మంత్రి లోకేష్‌ను ప్రశ్నించారు. అగ్రికల్చర్ విశ్వవిద్యాలయం నంద్యాల జిల్లాలో ఏర్పాటు చేయాలని, పీజీ కామన్ ఎంట్రెన్స్ టెస్టు రద్దు చేసి విశ్వవిద్యాలయానికి సంబంధించి అక్కడే ప్రవేశ పరీక్ష నిర్వహించాలన్నారు. ఎర్రిస్వామి, శశి, ప్రవీణ్, చందు, మనోజ్, సునీల్, మాబాషా, ప్రదీప్ పాల్గొన్నారు.

న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నంద్యాల(అర్బన్): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై బూటు విసిరిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని, ఆ ఘటనను నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్, మహాజన సోషలిస్టు పార్టీల ఆధ్వర్యంలో నాయకులు మొదట కోర్టు ఆవరణలోని న్యాయదేవతకు పూలమాల వేశారు. అనంతరం సాయిబాబానగర్ మీదుగా నూనెపల్లె ఫ్లై ఓవర్ నుంచి కలెక్టరేట్ వరకు అర్ధనగ్న ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీజేపై బూటు విసిరిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని కోరుతూ కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ రామునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాయికాటి బెన్జీ మాదిగ, మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నాయకులు ఎం.నరసింహులు మాదిగ, నాయకులు కత్తి ఓబులేసు మాదిగ, ర్యాబిన్సన్, అనిల్ మాదిగ, పుల్లన్న మాదిగ, రామచంద్రమాదిగ, శ్రీనివాసులు మాదిగ, గంగాధర్‌శెట్టి పాల్గొన్నారు.

సంక్షిప్తం

భూమిని కాపాడాలని వినతి

ఉయ్యాలవాడ: కొలుదారు నుంచి తన 85 సెంట్ల భూమిని ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని పెద్దయమ్మనూరు గ్రామ రైతు గోసుల హనుమంతు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 8లో తనకు 2.37 ఎకరాల భూమి ఉన్నా ఆన్‌లైన్‌లో వేరే రైతు పేరుపై చూపుతోందని వీఆర్‌ఓ, గ్రామ సచివాలయంలో ఫిర్యాదు చేసినా ఇంత వరకు సరిదిద్దలేదని ఆర్.పాంపల్లె గ్రామానికి చెందిన రైతు బాలసుబ్బారెడ్డి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించండి

చాగలమర్రి: ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఉపయోగించాలని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రాజేంద్రప్రసాద్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను ఆయన పరిశీలించారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

సాక్షి నెట్‌వర్క్: ఇటీవల పోస్టింగ్ ఆర్డర్లు అందుకున్న నూతన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. ఉయ్యాలవాడ మండలంలో 20 మంది, శిరివెళ్ల మండలంలో నలుగురు, చాగలమర్రి మండలంలో 30 మంది, దొర్నిపాడు మండలంలో ఏడుగురు ఉపాధ్యాయులు తమ జాయినింగ్ ఆర్డర్లను ఆయా మండలాల విద్యాశాఖ అధికారులకు అందజేసి విధుల్లో చేరారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఎంఈఓలు నూతన ఉపాధ్యాయులకు సూచించారు.

వైద్య సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె, దొర్నిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బంది సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. విజయవాడలో ధర్నా చేస్తున్న ఏపీ పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్స్‌కు మద్దతుగా ఉద్యోగులు నిరసన తెలిపారు.

రైతాంగ సమస్యలపై ప్రధాని ప్రకటన చేయాలి

నంద్యాల(న్యూటౌన్): రైతాంగ సమస్యలపై ప్రధాన మంత్రి మోడీ స్పందించి స్పష్టమైన ప్రకటన చేయాలని, రైతులు పార్టీలకు అతీతంగా రైతాంగ సమస్యలపై పోరాటం చేసేందుకు కదలి రావాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, రామచంద్రుడు అన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రబీ సాగుకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి తక్షణమే పార్లమెంట్‌లో చట్టం చేయాలన్నారు. మెట్ట పొలాలకు సాగు నీరు ఇవ్వాలని, 1.50లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని, కనీస మద్దతు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వమే పంటల బీమా ప్రీమియంను చెల్లించాలన్నారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శులు సురేష్, రామ్మోహన్, వీరన్న పాల్గొన్నారు.

పేరూరులో అగ్ని ప్రమాదం

- గుడిసె దగ్ధం.. గాయపడిన మూగజీవాలు



గాయపడిన మూగజీవాలు

రుద్రవరం: మండల పరిధిలోని పేరూరులో సోమవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటుచేసుకోవడంతో పశువుల కొట్టం కాలి బూడిదైంది. ఈ ఘటనలో 15 పశువులు గాయపడ్డాయి. గ్రామస్తులు తెలిపిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు నాగశేషు ఆవులు, గేదెలు, మేకల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. రోజుమాదిరిగా ఆదివారం రాత్రి పశువులను కొట్టంలో ఉంచాడు. సోమవారం తెల్లవారుజామున మూగ జీవాల అరుపులకు పక్కనే ఉన్న రైతు నిద్ర లేచి చూడగా కొట్టం నుంచి మంటలు ఎగిసిపడుతుండటం చూసి ఇరుగు పొరుగు వారి సాయంతో మంటలను ఆర్పేందుకు యత్నించారు. ప్రమాదంలో మూగజీవాలు గాయాల పాలయ్యాయి. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ వాటికి గ్రామానికి వెళ్లి వైద్యం చేశారు. విద్యుదాఘాతంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు బాధిత రైతు వాపోయాడు.

కనీస వేతనం ఇవ్వాలి



డీఆర్‌ఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఏపీ మెడికల్ కళాశాలలోని ఒప్పంద శానిటేషన్ వర్కర్లకు, సెక్యూరిటీ కార్మికులకు జీవో నం.138 ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు సుశీలమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్‌ఓ రామునాయక్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు, మూడు సంవత్సరాల పీఎఫ్, ఈఎస్ఐని చెల్లించాలన్నారు. శానిటేషన్ వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాసులు, కార్మికులు తులశమ్మ, సులోచనమ్మ, పాములేటి, లీలావతి, సావిత్రి, స్వర్ణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లను నెరవేర్చాలి



నిరసన తెలుపుతున్న దృశ్యం

గోస్పాడు: పీహెస్ వైద్యుల న్యాయపరమైన డిమాండ్‌లను కూటమి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాలలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైద్యులు ఎంతో కాలంగా పరిష్కారం కాని సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నత చదువుతో తమ కెరీర్ కోసం వెళ్తున్నారని, అందులో 15 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న వారికి న్యాయం చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. వారికి ప్రమోషన్లలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వైద్యుల సమ్మెకు తాము మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు. నాయకులు రత్నమ్మ, పద్మావతి, మాధవీలత, శ్యామలమ్మ, మహేశ్వరమ్మ, సుబ్బలక్ష్మమ్మ, అనిత, పుల్లమ్మ, షాహిన్ పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేద్దాం

నంద్యాల(అర్బన్): కర్నూలు సమీపంలోని నన్నూరు వద్దనున్న రాగమయూరి వెంచర్‌లో ఈనెల 16వ తేదీన దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరయ్యే బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో కూటమి పార్టీల నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. పత్తికొండ ఎమ్మెల్యే రామాంజనేయులు, శాప్ చైర్మన్ రవినాయుడు, నంద్యాల నియోజకవర్గ పరిశీలకులు నాయుడు పాల్గొన్నారు.

- నంద్యాల(వ్యవసాయం): ఈనెల 16వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ నంద్యాల జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని తొలిసారిగా జిల్లాకు వస్తున్నారని, ఆయన పర్యటనను చారిత్రాత్మకంగా నిలుపుదామని చెప్పారు. నాయకులు చింతలపల్లె సుధాకర్, చాందిని, చంద్రశేఖర్, ఉపేంద్రనాథరెడ్డి, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించండి



వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌ఓ రామునాయక్

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంతృప్తి స్థాయిలో వేగంగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌ఓ రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచిడి అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును జవాబుదారీతనంతో పరిష్కరించాలని చెప్పారు. పీజీఆర్ఎస్ అర్జీలతో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మొత్తం 188 దరఖాస్తులు అందజేశారని తెలిపారు.

వినతుల్లో కొన్ని..

- డోన్ మండల కేంద్రానికి చెందిన రమీజా తనకు ముగ్గురు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నారని, తల్లికి వందనం పథకం కింద తనకు డబ్బులు జమ కాలేదని, దయచేసి నాకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు.
- పాణ్యం మండలం కందికాయపల్లి గ్రామానికి చెందిన పి.వెంకటసుబ్బయ్య తన ముగ్గురు కుమారులకు ముగ్గురికి వివాహమైందని, వీరిని రేషన్ కార్డు నుంచి వేరు చేసి కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలని విన్నవించారు.
- ఆళ్లగడ్డ మండలం అంబులదిన్నె గ్రామానికి చెందిన ఎల్.బాలపోలయ్య, హౌసింగ్ పథకం కింద ఇల్లు మంజూరైందని ఇంటి నిర్మాణానికి సంబంధించి బిల్లులు మంజూరు కాలేదని, బిల్లులు త్వరగా మంజూరు చేయాలని కోరారు.